# అప్పలమ్మ

వేమూరి సుబ్రహ్మణ్యం

ఆత్మాభిమానం నాకు కద్దని వట్టి గొప్పలు చెప్పకోకోయ్—అని మహాకవి గురజాడ అన్న మాటలు అక్షరాలా నిజాలు. పారతంత్ర్యానికీ, ఆత్మాభిమానానికి పొత్తు కుదరదు. ఆత్మాభిమానం అణుమాత్రమైనా మిగలకుండా చంపేస్తుంది దారిద్ర్యం. అంతటి దారిద్ర్యంలోనూ తమవారి క్షేమంకోరి శ్రమించేవారు అరుదుగానైనా ఉన్నారు కనకనే ప్రపంచం ఇంకా నిలిచి ఉంది, మరి.

సాయంత్రానికి స్వస్తిచెప్పి అంధకారం ప్రపంచాన్ని ఆక్రమించుకొంటూంది. ఆ దురాక్రమణ అరికట్టాలనే దాపత్రయంతో విద్యుద్దీపాలు వెలిగాయి.

పగంల్లే కనబడదామని బస్సుస్టాండు వ్యర్థప్రయత్నం చేస్తున్నది. బలిసిన దున్నల్లాంటి ఆర్. టి. సి. బస్సులు మదంఎక్కిన ఏనుగుల్లాగ, హారన్ అవసరం లేకుండానే రోడ్డుమీది మనుష్యులు తప్పుకొనేటట్టుగా చప్పుడు చేసుకొంటూ పరిగెత్తుతున్నాయి.

ఒక్కో బస్సు వచ్చినప్పుడల్లా స్టాండులో రిక్షావాళ్ళ రొద ఎక్కువైపోతూంది. బస్సుస్టాండు ఓ చిన్న రైల్వేస్టేషన్‌లాగ హడావిడి పడుతూంది.

ప్రపంచంలోని సందడితో సంబంధం లేకుండా బస్సుస్టాండు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌మీద 'పావలా భోజనవ్యాపారం' మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగుతూంది.

ఆకలిబాధ చల్లార్చుకోవటానికి రూపాయలూ, అర్ధలూ ఖర్చుపెట్టలేనివాళ్ళు రెండు పూటలా ఇక్కడికి వస్తూంటారు. ఈ ఫుట్‌పాత్‌పైన పావలా ఇస్తే వాళ్ళకు ఇంత అన్నమూ, అందులోకి పులుసో చారో లభిస్తుంది. ఆ భోజనాన్ని ఫుట్‌పాత్‌మీదే స్వాహాచేసి ఇన్ని మంచినీళ్ళు తాగి, ఆకు ఫుట్‌పాత్ పక్కనే పారేసి వెడుతూంటారు. ఫుట్‌పాత్‌పైన నిత్యం పన్నెండు మందిస్త్రీలు ఈ వ్యాపారం చేస్తుంటారు.

గంట ఏడయింది.

పావలా భోజనవ్యాపారాన్ని ఇక్కడ మొట్టమొదట ప్రారంభించిన ముగ్గురు స్త్రీలలో అప్పలమ్మ ఒకతె. అయితేనేం? మిగిలినవాళ్ళలాగా ఆమె గంపనిండా అన్నమూ, రెండు మూడు గిన్నెలనిండా ఆధరవులూ తీసుకురాదు. మితంగా తెస్తుంది. అందుకనే అప్పుడే ఆమె గంపలోని అన్నమూ, గిన్నెలోని తోటకూరపులుసూ అయిపోయాయి. ఈ సాయంత్రానికి ఆమె వ్యాపారం ముగిసింది.

ఇంటికి వెళ్ళాలనే ప్రయత్నంలో అప్పలమ్మ గిన్నె లను, లోటాలను బుట్టలోకి సర్దుకొంటూంది. ఇది చూసి సాటి వ్యాపారస్థురాండ్రు మనస్సులో సంతోషించారు. పోటీదారు ఒకరు తగ్గినా మంచిదేమరి!

గంప నెత్తికి ఎత్తుకుని అప్పలమ్మ ఇహ బయలు దేరదామని అనుకొంటుండగా ఏ కానిస్టేబుల్ జానకిరామయ్య వచ్చాడు. "ఏం అప్పలమ్మా, ఇంటికేనా?" అంటూ పలకరించాడు.

ఆమె వయస్సు ముప్ఫయిసంవత్సరాలే అయినప్పటికీ నల్లగానూ, లావుగానూ ఉండటంచేత అప్పలమ్మ నలభైఏళ్ళ మనిషిలాగ కనబడుతుంది. "యాపారం అయిపోనాది, కానిస్టేబుల్‌గారూ. ఎడుతుండా" అంటూ ఆమె డబ్బుల సంచితీసి పావలాకాసు జానకిరామయ్యకు ఇచ్చింది.

ఫుట్‌పాత్‌మీద ఎలాటి వ్యాపారమూ చెయ్యరాదని నిషేధం ఒకటి ఉంది. కాబట్టి చట్టంప్రకారం వీళ్ళను పోలీసులు అరెస్టు చెయ్యచ్చు. కాని వాళ్ళు దయతలిచి వీళ్ళని వ్యాపారం చేసుకోనిస్తున్నారు. తమ దయకు ప్రతిఫలంగా బీటుకానిస్టేబులు వీళ్ళదగ్గర పావలా చొప్పున వసూలు చేస్తుంటాడు. అప్పలమ్మ ఇచ్చిన పావలాకాసు జేబులో వేసుకొని మిగిలినవాళ్ళ దగ్గర కూడా మామూలు వసూలు చేసుకోనేందుకు జానకి రామయ్య సాగిపోయాడు.

నెత్తిమీద గంపతో అప్పలమ్మ ఇంటికి బయలుదేరింది. ఆమె ఉంటున్న పాక అక్కడికి రెండు ఫర్లాంగులు మాత్రమే ఉంటుంది.

కాశీపతి గ్రంథాలయం ఎదురుగా, గాంధీరోడ్డు పక్కన ఇదివరకు రెండువేలగజాల ఖాళీస్థలం ఉండేది. మ్యునిసిపాలిటీకి చెందిన స్థలం కాబట్టి ఊరికెనే పడి ఉండేది. అయిదేళ్ళక్రితం సినిమా టాకీసుల దగ్గిర మిరపకాయబజ్జీలూ, వేరుసెనక్కాయలూ అమ్ముకొనే కోటిలింగం ఈ ఖాళీస్థలంలో ఓ శుభముహూర్తాన గుడిసె వేసుకున్నాడు. అతణ్ణి చూసి కిళ్ళీకొట్టు నరసింహం, బ్రాకెటుఆట ఏజెంటు నరసయ్య చెరో పాక వేసుకొన్నారు. వీళ్ళను చూసి జనప్రియ ప్రెస్‌లోని కంపోజిటరు అబ్రహాం, శ్రీరామా రైసుమిల్లులో పనిచేసే ఖాసిం, రెవిన్యూ డిపార్టుమెంటులో ప్యూను జగ్గులు, భారత్ ఆటోమొబైల్సులో వర్కరు సాంబయ్య ఇలా ఒకళ్ళ తరవాత ఒకళ్ళు పాకలు వేసుకొని నివాసాలు ఏర్పాటు చేసుకొన్నారు. ఇక్కడే కొంత ఖాళీస్థలంలో అప్పలమ్మ తనూ ఓ పాక వేసుకొన్నది.

ఇప్పుడక్కడ పాకలేతప్ప ఖాళీస్థలం కనబడదు. కొందరు తమ తమ గుడిసెలను రెండుభాగాలు చేసి ఒక భాగాన్ని అద్దెకుకూడా ఇచ్చుకొన్నారు. వీళ్ళను వెళ్ళగొట్టి, తమ ఖాళీస్థలాన్ని తిరిగి స్వాధీనంచేసుకొనాలని మ్యునిసిపాలిటీలో ఎప్పుడూ అనుకొన్నట్టు కనబడదు. దీనికి కొంత కారణంకూడా లేకపోలేదు. అక్కడ ఓట్లన్నీ ఎప్పుడూ కౌన్సిలర్ ప్రతాపరెడ్డికి పడుతూంటాయి. మ్యునిసిపాలిటీలో అతడికి ముఠాకూడా ఉంది. ఈ స్థలాన్ని అందరికీ సమష్టిగా ఇప్పించాలని ప్రతాపరెడ్డి ప్రయత్నిస్తున్నాడని అందరికీ తెలుసు. ఇంత తతంగం ఉండగా వాళ్ళను అక్కడినించి కదిలించాలని ఎవరన్నా ప్రయత్నించటమే?

అక్కడి గుడిసెలు వరసా, వావీలేకుండా అడ్డదిడ్డంగా ఉంటాయి. ఎవరి గుడిసె పక్కన వాళ్ళు చెత్తా, చెదారం పోగుచేసిపెట్టారు. అంతవరకు వాళ్ళ సరిహద్దు అన్న మాట. గుడిసెలమధ్యనుంచి అష్టవంకరలతో ఒక మురుగుకాలవ పారుతూ రోడ్డుమధ్యన ఉన్న మురికి గుంటలో కలుస్తూంటుంది.

చీకటి పడటంతో అప్పటిదాకా రోడ్డుమీద రకరకాల ఆటలాడిన పిల్లలు ఎవరిగుడిసెల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. ఎక్కడో ఒకచోటచేరి కబుర్లాడుకొంటున్న ఆడవాళ్ళు తమ నివాసాల్లోకి వెళ్ళారు. అక్కడి గుడిసెలలో మొగవాళ్ళు ఏ అర్ధరాత్రికోగాని ఇళ్ళకు చేరుకోరు. సామాన్యంగా ఆడవాళ్ళుగూడా ఏవేవో పనులు చేసుకొంటూనే ఉంటారు.

వాటిలో ఎక్కణ్ణించో ఓ పాకలోని మొగవాడు తాగి ఇంటికి వచ్చినట్టున్నాడు. స్త్రీ గొంతు గట్టిగా వినబడుతూంది. "నీ జిమ్మడ, కొంపకు రాకండా ఆ లంజ ఇంటనే సావరాదూ? నానూ పిల్లలూ సుకంగా ఉంటాం."

"అట్టాగే సాగతాండు. ఎన్నడో నీగొంతు పిసికి మంగినే తెచ్చి ఈడ పెడతా" అంటూ సమాధానం వస్తూందో మొగకంఠం.

నెత్తిమీద గంపతో అప్పలమ్మ తన గుడిసెకు చేరేటప్పటికి ఆమె తల్లి సిద్ధక్క గుడిసెముందు నులక మంచంమీద కూర్చుని ఉంది. మంచం పక్కనే జర్మన్ సిల్వర్ టిఫిన్‌కారియర్ ఉంది. రోజూ సాయంత్రం కూతురు ఇంటికి రాగానే, ప్రెయివేటుకు వెళ్ళిన మనవడూ, మనమరాలి కోసరం సిద్ధక్క భోజనం తీసుకు వెడుతూంటుంది. పిల్లలిద్దరూ సాయంత్రం ఆరింటికే ప్రయివేటుకు వెళ్ళి, రాత్రి మేస్టారింట్లోనే పడుకొని



తెల్లవారే వస్తారంటారు.

కూతురు రావటం చూసి సిద్దక్క లేచి నిల్చుంది. "నే ఎల్తాండా" అన్నది.

"ఆళ్ళకి కోడిగుడ్లు అట్టే కెడుతుండావా?" అని అడిగింది అప్పలమ్మ.

"ఏందే? నాకు సెప్పాలా పత్తేకంగా?"

"అడిగిండే. ఆళ్ళకి బలంగుండే బువ్వెట్టమని అయ్యోరు సెప్పింద్రు. అట్టగాకపోతే సదువు సక్కంగా రాదంట."

"సర్లే" అంటూ సిద్దక్క టిఫిన్‌కారియర్ తీసుకుని బయలుదేరింది. ఆమె రోడ్డుమీదికి వెళ్ళేదాకా చూస్తూ నిలబడి, తరవాత నెత్తినున్న గంప చేతుల్లోకి తీసుకొని అప్పలమ్మ గుడిసెలోకి వెళ్ళింది.

ఎదురు గుడిసెలోనించి ఎవరో స్త్రీ పిల్లల్ని చావగొడుతూంది. ఇద్దరు ముగ్గురు పిల్లలు ముక్తకంఠంతో పెద్దపెట్టున ఏడుస్తున్నారు. 'దీని జిమ్మడ! సవితమ్మకు పిల్లల్ని సావగొట్టందే మనసూరుకుండదు ముండకి' అనుకొంటూ అప్పలమ్మ గంపను గుడిసె ముందు గదిలో మూల పెట్టింది.

నాలుగు పక్కలా మట్టిగోడలతో, పైకప్పు తాటాకులతో ఉన్న గుడిసె అది. మధ్య తడికె పెట్టి గుడిసె రెండు గదులుగా చేశారు. అప్పలమ్మ తడుముకుంటూ ఆ కటిక చీకటిలోనే గదిలో కుడివేపు గోడకు ఉన్న గూటిలోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించింది. గూటిపక్కనే గోడకు చిమ్నీ ఉంది. చిమ్నీ వెలుతురులో ఆ గది మసకగా కనిపిస్తూంది. మట్టినేల శుభ్రంగా అలికిఉంది. సామాను అట్టేలేదు. కుడిచేతివేపున ఓ దణ్ణెంమీద రకరకాల గుడ్డలు వేలాడుతున్నాయి. దణ్ణెంకింద ఓ బీరువా, ఓ చెక్కపెట్టె ఉన్నాయి. బీరువాలో పిల్లల గుడ్డలూ, అప్పలమ్మ మొగుడు వీరన్న ఖద్దర్లాగూ, చొక్కాలూ ఉంటాయి. పక్కఉన్న పెద్దపెట్టెలో ఏవేవో సామానులు ఉన్నాయి.

నేలమీద పెట్టిన గంపను గోడ పెట్టి అప్పలమ్మ దీపం తీసుకుని తడికెతలుపు తోసుకుని వెనకగదిలోకి వెళ్ళింది. అది వంట ఇల్లు. తూము




పక్కనే పొయ్యి, దానిమీద జర్మన్‌సిల్వర్ గిన్నె, ఆ పక్కనే మరో జర్మన్ సిల్వరు బేసిన్, కొంచెం పక్కగా మంచినీళ్ళ కుండా ఉన్నాయి. కుడివేపున, అంటే మంచి నీళ్ళకుండ నానుకొనే బారుగా పెద్ద అరుగు ఒకటి ఉంది. దానిమీద లోటాలూ, మూడు మూకుళ్లూ, రెండు గాజుగ్లాసులూ, మూడు పింగాణీ పళ్ళాలు ఉన్నాయి.

అప్పలమ్మ లోటాతో కుండలోని మంచినీళ్ళు ముంచుకొని పొయ్యిదగ్గరగా పెట్టింది. పింగాణీ కంచంతీసి పెట్టుకొంది. అరుగుమీద బుట్టలోంచి ఒక ఉల్లిపాయతీసి కంచంలో వేసుకొంది. మళ్ళీ కుండ పక్కనే పెట్టుకొని అన్నానికి కూర్చుంది.

ఇంతలో సైరన్ కూసింది. అంటే గంట ఏడు పూరయింది.

'అయ్యబాబో, సయిరను కూసింది. నాయాళ్ళు ఈపాటికి ఒక్కొక్కళ్ళే ఒత్తూంటారు' అనుకొంటూ ఆమె పొయ్యిమీద గిన్నెలోనించి అన్నంతీసి కంచంలో పెట్టుకొంది. మరో అయిదు నిమిషాల్లో భోజనమూ పూర్తిచేసింది.

'ఏంది? నరసిమ్ములు ఇంకా రావేదేంది? ఏడన్నా సారాకుండలను పారబోసినాడా, ఏంది?' అని గాభరా పడుతూ అప్పలమ్మ గిన్నెలనూ, లోటాలనూ సర్దెయ్యటం మొదలుపెట్టింది.

ఇంకో పావుగంటలో తన గుడిసె పక్కనున్న చిన్న తాటాకుల సావిడిలో అప్పలమ్మ సారావ్యాపారం మొదలు పెడుతుంది. ప్రొహిబిషన్ అంటూ ఒకటి ఉంది కాబట్టి ఆమె చేసేది దొంగసారా వ్యాపారమనే చెప్పాలి.

వంటింట్లోని పని పూర్తిచేసుకొని చేత్తో చిమ్నీ పట్టుకుని అప్పలమ్మ ముందుగదిలో అడుగుపెట్టగానే బయటినుంచి "ఒదినా, అప్పలమ్మొదినా" అంటూ నరసింహులు కేక వినిపించింది. సారావ్యాపారంలో అప్పలమ్మకు నరసింహులు కుడిభుజం. నల్లగా, కండలు తిరిగి పహిల్వాన్‌లాగ ఉంటాడు నరసింహులు.

"ఏందిరా నరిసిగా, ఇంతాలీసం సేసినావు?" అంటూ అప్పలమ్మ బయటికి వచ్చింది. అప్పటికే నరసింహులు గుడిసెకు కుడిపక్కనున్న సావిడిలో లాంతరు వెలిగించి, రిక్షాలో తాను తెచ్చిన రెండు పెద్ద సారాకుండలనూ అక్కడ పెట్టించేశాడు. అప్పలమ్మ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా నిక్కరు జేబులోంచి చిల్లర తీసి రిక్షావాడికి ఇచ్చి పంపేశాడు.

రిక్షావాడు వెళ్ళిపోయాక నరసింహులు అప్పలమ్మ వేపు తిరిగి, "ఒవి కాదొదినా, ఇయ్యాళేం జైందను కొంటాక్?" అంటూ ఏదో చెప్పబోయాడు.

అతడి మాటలను అప్పలమ్మ సగంలోనే తుంచేసింది. "కతలన్నీ ఆనక సెబుదువుతే. ముందయ్యన్నీ సర్దు" అంటూ హుకుం జారీ చేసింది.

నరసింహులు గుడిసెలోకి వచ్చి చిమ్నీ తీసుకుని వంటింటి పెరటితలుపు తీసి, జేబులోంచి ఒక చిన్న తాళంచెవి బయటికి తీసి, దానితో ఎదురుగా ఉన్న మరో చిన్న పాక తలుపు తాళం తీశాడు. చేతిలోని చిమ్నీ గోడకున్న మేకుకు తగిలించాడు. చిన్న కేతలుప్పు తోశాడు. ఒక్కసారి లోపలినుంచి సా... గుప్పున బయటికి కొట్టింది.. అది నరసింహులుకు కమ్మటి సువాసన.

ఎక్కడో నాలుగు గుడిసెల అవతల జగదీశుడు 'ఉద్యోగవిజయాలు' నాటకంలోని "అలుగటయే యెరుంగని. . ." అనే పద్యాన్ని గొంతెత్తి పాడుతున్నాడు. 'నాయాలు బాగానే పాడతాడు. . .' అనుకొంటూ నరసింహులు ఒక సారాకుండను బయటికి తెచ్చాడు. అది నిన్నరాత్రి మిగిలిపోయిన సారా. నరసింహులు ఆ కుండను తీసుకువెళ్ళి సావిడిలో పెట్టాడు. అప్పటికి అప్పలమ్మ సావిడిలో పూర్తిగా తాటాకుల చాపలు పరిచింది. సారాకోసరం పేరయ్య, యాకోబు, ముసలయ్య వచ్చి తలో మూలా కూర్చున్నారు. "పెద సిమ్మలూ, ఇయ్యాల ఆ శీసం అయిందేందిరా?" అని అడిగాడు ముసలయ్య.

"ఏందో అయిందిలే" అంటూ నరసింహులు మళ్ళీ పాక వెనకాల గుడిసెలోకి తిరిగివచ్చి ముంతలున్న బుట్ట తీసుకొని తలుపువేసి చిమ్నీతో ఇవతలికి వచ్చాడు. చిమ్నీ చల్లార్చి గుడిసెలో పెట్టి, బుట్ట పట్టుకొని సావిట్లోకి వచ్చాడు. అప్పటికి మరో ఇద్దరు ఖాతాదార్లు రెడ్డెమ్మ, చౌదరీ, ముచ్చిముసలయ్య పక్కనే కూర్చున్నారు.

"నాకూ రెడ్డెమ్మకు, చౌదరికీ తలా ఓ ముంత కల్లు పొయ్యి. పందెంబగ్గి ఓడినానులే" అంటూ ముసలయ్య జేబులోంచి రూపాయి నోటుతీసి అప్పలమ్మకు ఇచ్చాడు.

సారా కుండంకు కుడివేపున ఒక చిన్న స్టూలు వేసుకుని అప్పలమ్మ కూర్చుంది. ఎడమవేపున కొంచెం పెద్ద స్టూలుమీద నరసింహులు చేతిలో కొలతముంతతో కూర్చున్నాడు.

అప్పలమ్మ ముసలయ్య చేతినుంచి రూపాయి నోటు అందుకొని పక్కనేఉన్న మరో చిన్న ముంతకు మూతు మూట్లు తగిలించి కళ్ళు కద్దుకొని లోపల పడేసింది. తన డబ్బులసంచీ బయటికితీసి అందులో చిల్లర పావలా తీసి ముసలయ్యకు తిరిగి ఇచ్చింది.

"నాకూ ఓ ముంత సారా" అన్నాడు యాకోబు పావలాకాసు ఇచ్చి.

"ఓ ముంత" అంటూ పేరయ్య ఓ అర్ధరూపాయి కాసు ఇచ్చాడు.

అప్పలమ్మ ఆ డబ్బులందుకొని ముంతలో వేసుకొంది. నరసింహులు అందరికీ తలో ముంతెడూ మద్యం అందిచ్చాడు. ఆ నాటి సారా వ్యాపారానికి నాందీ ప్రస్తావన జరిగింది.

ఇంతలో ఆ వాడలోనే కాపురం ఉంటున్న మీనాక్షి ఒక తట్టనిండా మటన్ సమోసాలూ, ముక్కలూ పెట్టుకువచ్చి సావిడి గుమ్మం పక్కనే కూర్చుంది. మద్యం తాగేవాళ్ళకు మధ్యమధ్య మాంసం ముక్కలు తింటూంటే స్వర్గం కనిపిస్తుందట! ఒక చేత్తో సారా ముంత, మరో చేత్తో మాంసంముక్క పట్టుకొంటే ప్రపంచంలో వాళ్ళకు ఇంకేమీ అక్కరలేదట!

* * * *

రాత్రి పదకొండయింది. చుట్టూ ఉన్న గుడిసెలన్నీ నిద్ర పోతున్నాయి.

అప్పలమ్మ సారాసావిడిలో మటుకు రద్దీ తగ్గలేదు. వచ్చేవాళ్ళు వస్తూనే ఉన్నారు. వెళ్ళేవాళ్ళు వెడుతూనే ఉన్నారు. ఆమె డబ్బుల ముంతలోని చిల్లర రూపాయి నోట్లుగానూ, రూపాయి నోట్లు అయిదూ, పదిగానూ రూపాంతరం పొందుతున్నాయి.

పది ముంతలు సారా పట్టించినా శరీరం తూలని మహారథులూ, అయిదు ముంతలదాకా తొణకని అతిరథులూ, రెండు ముంతలదాకా నిభాయించుకోగల రథులూ, కొంచెం ఒక్క ముంతకే మైకంకమ్మే అర్ధరథులూ ఆ సావిట్లో ఉన్నారు.

నిషా ఎక్కిన నరులు నిండుగా ఉన్నారు కాబట్టి సావిడిఅంతా కూనిరాగాలతో, వెర్రికేకలతో, పిచ్చి ప్రలాపాలతో గోలగోలగా ఉంది.

మీనాక్షి తట్టలో సరుకు అయిపోయింది. మరింత తీసుకురావడానికి వస్తానని చెప్పి ఆమె అప్పుడే వెళ్ళింది. వెడుతూ వెడుతూ ఓ ముంతెడు పుచ్చుకొని మరీ వెళ్ళింది.

రేపు పనిలోకి వెళ్ళగానే మేస్త్రీని పట్టుకొని ఎముకలు విరగగొట్టకపోతే మీసాల రత్తయ్య కొడుకునే కానని ప్రతిజ్ఞ చేశాడు రంగస్వామి. సారాముంత చేత పట్టుకొని "నాథం నేదురా, శాస్త్రి సచ్చాక దేశం సెడిపోయింది" అంటూ సోమయ్య ప్రకటన జారీ చేశాడు.

ఇటువంటి రకరకాల వింత వేషాలు కోకొల్లలు. అర్ధరథుడైన రిక్షా వెంకటేశ్వర్లు ఈ రాత్రి మూడో ముంతకూడా స్వాహాచేశాడు. శరీరం పట్టం తప్పింది. కళ్ళకు ఎదురుగా ఉన్న వస్తువులు ఆకారం మారి కనబడటం మొదలుపెట్టాయి. సారాకుండలకు దగ్గరగానే కూర్చున్న వెంకటేశ్వర్లుకు అప్పలమ్మ ఎలాగో కనిపించింది. ఒక్కసారిగా లేచినిల్చున్నాడు. రెండడుగులు ముందుకు వేసి అప్పలమ్మ చేతిని అందిపుచ్చుకొన్నాడు.

"ఇంకా యాపారమేనా? రా! రేత్రి సూడు, ఎంత కమ్మగా ఉందాదో?" అన్నాడు వెంకటేశ్వర్లు కవిత్వ ధోరణిలో.

అప్పలమ్మ తెల్లబోయింది. తరవాత తమాయించుకొంది. ఆమెకా అనుభవం మరీ కొత్తకాదు. అడపా తడపా మైకంలో ఒళ్ళు తెలియనివాళ్ళు ఇలాగే ప్రవర్తిస్తూంటారు. కాని దిగ్గా వెంకటేశ్వర్లు అలి సొమ్ముడు. మామూలుగా అప్పలమ్మను "పెద్దక్కా" అని పిలుస్తూంటాడు.

"ఏ! ఏందిరా ఇది? గేసంలేదూ?" అంటూ అప్పలమ్మ విదిలించుకొంటూ చెయ్యి ఇవతలికి లాక్కొంది.


వెంకటేశ్వర్లు సరిగా నిల్చోలేకపోతున్నాడు. "గేనం ఏముందే? రా! ఇయ్యాల మా ఉషారుగా ఉండాది. నీగా వాలంటే జానికి లాడిజింగ్‌కి పోదాం" అంటూ మళ్ళీచెయ్యి ముందుకు చాచాడు.

మసక వెలుతురులో అప్పలమ్మ ముఖంలో నిప్పులు కురవటం మైకంలో ఉన్న వెంకటేశ్వర్లుకు కనబడలేదు. "ఛీ, గొడ్డుమోతు యెదవా, మదివిని కాదురా? పో అవతల్కి. . . నరసిమ్ములూ, ఈడిని పంపెయ్యరా" అన్నదామె.

నరసింహులు స్టూలుమీదినించి లేచాడు. వెంకటేశ్వర్లు భుజంమీద తన బలమైన కుడిచేతిని వేసి "పదరా" అన్నాడు.


వెంకటేశ్వర్లుకు విపరీతమైన కోపం వచ్చింది. "ఎవడ్రా? నంజకొడకా. . . నీ. . . నాకూ అప్పలమ్మకు మద్దిన నీ దేందిరా?" అన్నాడు.

అంతే. నరసింహులు కుడిచేతి పిడికిలి వెంకటేశ్వర్లు






గౌర్ మోహన్ దాస్ అండ్ కం.,
233, పాత చైనాబజార్ వీధి,
కలకత్తా—1
ఫోన్: 22—6580



ముఖానికి మెరుపులాగ తగిలింది. వెంకటేశ్వర్లు అల్లంత దూరాన పడ్డాడు. నరసింహులు రెండడుగులు ముందుకువేసి "నోరెత్తితే నరుకుతా నాయాలా" అంటూ నెత్తిమీద ఫెడీఫెడీమని మరో నాలుగు వడ్డించాడు.

"సాల్లే. అల్లే రిచ్చాలో కుదేసెయ్" అన్నది అప్పలమ్మ.

నరసింహులు కిందపడ్డ వెంకటేశ్వర్లును కాలరు పట్టుకొని లేవనెత్తి, బరాబరా ఈడ్చుకువెళ్ళి రోడ్డు మీదఉన్న అతడి రిక్షాలో కూలేసిపెట్టి చేతులు దులుపుకొని వెనక్కి తిరిగేటప్పటికి అతడికి అప్పుడే సైకిలు దిగుతున్న ప్రొహిబిషన్ జవాను సుబ్బారావు కనిపించాడు. అతడిని చూడగానే నరసింహులు ఆగిపోయాడు.

సుబ్బారావు తన కొత్త సైకిల్‌కు స్టాండువేసి ఎడంచేతికి ఉన్న విలువైన రిస్టువాచీతో స్టైలుగా ఆడుకొన్నాడు. విద్యుద్దీపకాంతిలో అతడి టెర్లిన్ చొక్కా, రెండు చేతులవేళ్ళకూ ఉన్న ఆరు ఉంగరాలూ, వాటిలోని రంగురంగుల రాళ్ళూ మెరిసిపోతున్నాయి.

"అరెరె, మీరే ఒచ్చిం(డ్రా? తవరు సెప్పింది మా ఒదినకి ఇంకా సెప్పనే లెదుండీ, ఎట్టా?" అన్నాడు నరసింహులు.

"సరేలే. ఆమెను ఇటు పిలు, నేనే చెబుతా. చాలా అర్జెంటు" అన్నాడు సుబ్బారావు

నరసింహులు వెళ్ళి ప్రొహిబిషన్ జవాను వచ్చినట్లు అప్పలమ్మకు చెప్పాడు. అప్పలమ్మ ముంతలోని డబ్బు తీసి సంచీలో పెట్టుకొని, సంచీని బొడ్లో దోపుకుని పరిగెత్తుకు వచ్చింది. "లోనికి రారాదుండీ" అంటూ సుబ్బారావును పలకరించింది.

"పరవాలేదులే, నీతో పనుండి. . ."

"ఈ వారం మామూలు నరసిమ్ములుగాడికిచ్చి మంగళోరంనాడే అంపినాను. ఇచ్చిండా?"

"అది ఇచ్చాడులే. . . పెద్ద దొరగారు ఇన్‌స్పెక్షన్‌కి వస్తున్నారు. బోలెడు ఖర్చు నెత్తిన పడింది. అంచేత మీ అందరి దగ్గిరా మరో ఇరవై తీసుకురమ్మనమని ఎస్సైగారి ఆర్డర్" అన్నాడు సుబ్బారావు. అతడు స్కూలుఫైనలు కూడా పాసయ్యాడు. ఇంతా చదివి జవాను ఉద్యోగం చేస్తున్నాడని ఎవరైనా అతడిని చూచి బహిరంగంగా జాలిపడితే, గుమాస్తా ఉద్యోగంచేస్తే కొత్త సైకిలూ, విలువైన రిస్టువాచీ, టెర్లిన్ చొక్కాలూ, ఉంగరాలూ, నెలకు మూడు నాలుగు వందలు పైరాబడీ ఎలా ఉంటుందని సుబ్బారావు మనస్సులో అనుకొంటుంటాడు.

సుబ్బారావు మాటలతో అప్పలమ్మ ముఖం తెల్లబడింది. "ఏంది బాబూ, బేరాలు సాలా సప్పగా ఉండాయి. ఇప్పుడు నాకాడ. . ."

"ఇదిగో అప్పలమ్మా, నా కదంతా తెలీదు. మర్యాదగా ఇవ్వకపోతే నిన్నూ నీ కుండలనూ, ఆ తాగినోళ్లనూ రిక్షాలో స్టేషనుకు తొక్కురమ్మని ఎస్సైగారి ఆర్డర్. తియ్, డబ్బులు బయటికి. . ."

"ఏంది దొరా, ఈ అన్నాయం?" అని సణుక్కొంటూ అప్పలమ్మ డబ్బులసంచీ బయటికి తీసి అందులోంచి రెండు పది రూపాయలనోట్లు సుబ్బారావుకు ఇచ్చింది.

ముట్టుకొంటేనే చిరిగిపోయేటట్లున్న ఆ నోట్లను సుబ్బారావు అందుకొన్నాడు. చొక్కా జేబులోంచి పదిరూపాయల నోట్లబొత్తి తీసి వీటిని నోట్ల మధ్య పెట్టి, బొత్తి జేబులో పెట్టుకొని సైకిలెక్కి తుర్రుమన్నాడు.

అప్పుడు అర్ధరాత్రి పన్నెండు కావస్తూంది.

* * *

తెల్లవారింది. ఏడుస్వరయినా కాలేదు. అప్పుడే సూర్యభగవానుడు ప్రచండవిహారం చేస్తున్నాడు. ఆకాశం నిర్మలంగా, నీలంగా ప్రతివారినీ భయభ్రాంతులను చేసేటట్లుగా మెరిసిపోతూంది.

ఆషాఢం ప్రవేశించినా వర్షపుచుక్క లేదు! 'భగవాన్, ఈ యేడుకూడా కరువు తప్పదా?' అనుకొంటూ చిన్నా పెద్దా అంగరగా వణికిపోతున్నారు.

అప్పలమ్మ మొగుడు వీరన్న తమపాకలోంచి రోడ్డుమీదికి వచ్చాడు అప్పలమ్మకంటే వయస్సులో ఐదుసంవత్సరాలు పెద్దే అయినప్పటికీ వీరన్న ఆమెకు తమ్ముడులాగా కనిపిస్తాడు. చీకూ చింతా లేని జీవి. ఆరడుగుల ఎత్తు ఉండటంచేత సన్నగా కనిపిస్తాడు. ఓపిక ఉన్నంతసేపు రిక్షా తొక్కుతాడు. సంపాదించిందంతా నిర్విచారంగా, నిస్సంకోచంగా ఖర్చు పెట్టేస్తాడు.

వీరన్న నీలంరంగు నిక్కరుతొడిగి, దానిమీద ఆకు



అత్తింటి పయనం

చిత్రం—బి. ప్రభాకరరావు (హైదరాబాదు)

పచ్చ గళ్ళున్న పసుపురంగు చొక్కా వేసుకొన్నాడు. కాళ్ళకు హవాయ్ చెప్పులున్నాయి. రోడ్డుమీదికి వచ్చాక కాలు ఝాడించి మాధవచంద్ర బియ్యం మిల్లువైపు చకచకా నడక సాగించాడు.

అక్కడికి మిల్లు రెండు ఫర్లాంగుల దూరంలో ఉంటుంది. మిల్లులోని కార్మికులను నమ్ముకొని కేరళనించి వచ్చిన సాంబశివనాయర్ సంవత్సరం క్రితం అక్కడ ఒక చిన్న టీస్టాలు తెరిచాడు. అతడి నమ్మకాన్ని కార్మికులు వమ్ము చెయ్యలేదు. ఈ మధ్యే నాయర్ తన టీస్టాలును హోటలుగా మార్చాడు.

నెలరోజులనించీ నాయర్ హోటలుతో అప్పలమ్మ ఉదయం అయిదుగంటలు మొదలు పదిన్నరదాకా పిండి రుబ్బటం, ఉల్లిపాయలు తరగటం మొదలైన పనులు చెయ్యటానికి వెడుతూంది.

"భగవంతుని దయవల్ల నాలుగు డబ్బులు గిడుతూనే ఉండాయ్‌గందా? హోటలు పనికి ఎల్లడం ఎందుకు?" అంటూ సిద్దక్క, వీరన్న ఆమెతో ఎన్నో సార్లు తగువు పెట్టుకొన్నారు.

నాయర్ నెలకిచ్చే పదిరూపాయల కోసరం అప్పలమ్మ ఈ పని చేస్తూందని వారి ఉద్దేశ్యం.

"నెలకు పదిరూపాయలొస్తుంటే చేదా ఏంది?" అంటూ అప్పలమ్మ తల్లికీ, మొగుడికీ సమాధానం చెప్పేది.

వీరన్న నాయర్ హోటలు చేరుకొనేటప్పటికి అప్పుడే అతడి కొడుకు, కూతురు పుస్తకాలసంచీలు భుజాన [illegible] హోటలులోంచి బయటికివస్తున్నారు. వాళ్ళిద్దరూ [illegible] ప్రయివేటు మేస్టారి ఇంటినించి ఇక్కడికి [illegible]. అప్పలమ్మ ఇద్దరిచేతా మొహాలు కడిగించి చెరో రెండు ఇడ్లీలు తినిపించి ఇంటికి పంపుతుంది.

"అయ్యా, మా అమ్మగారు నిన్నొకసారి రమ్మన్నారు" అన్నాడు అమ్మన్నవేళ్ళ గారి తండ్రితో.

"అట్టాగేలే. ఇయ్యాలే ఎత్తా" అన్నాడు వీరన్న.

"అయ్యా, పది పైసలియ్యే. ఇస్కూలులో ఇదమ్మాయి సర్కసుండాది" అని అడిగింది ఆరేళ్ళ సీత. ఇటువంటి వాటికి అప్పలమ్మ డబ్బులివ్వదు. అందుకని పిల్లలకు వీరన్నో, సిద్దక్కో శరణ్యం. వీరన్న నిక్కరు జేబులోంచి రెండు పదిపైసల బిళ్ళలు తీసి చెరొకటి ఇచ్చాడు. ఇద్దరూ సంతోషంతో సాగిపోయారు.

వీరన్న వచ్చినట్లు ఎవరో వెళ్ళి అప్పలమ్మకు చెప్పారు. అతడు అప్పలమ్మ మొగుడుగా అక్కడ అందరికీ తెలుసు. తడిచేతులను కొంగుకు తుడుచుకొంటూ అప్పలమ్మ లోపలినించి వచ్చింది.

వీరన్న ఇటువంటి చిన్నచిన్న హోటళ్ళలో కాఫీ తాగడు. అందుకని అప్పలమ్మ వచ్చేవరకు ఒక మూల కుర్చీలో ఊరికెనే కూర్చున్నాడు. అప్పలమ్మ వస్తూనే మొగుణ్ణిచూసి "ఏంది, ఇటొచ్చినవ్?" అని అడిగింది.

వీరన్న ఉపోద్ఘాతం ఏమీ లేకుండా "సూడయే, నాకు అరిజెంటుగా ఓ పదిరూపాయలు కావాల" అని అడిగాడు.

డబ్బు ఎందుకని ఆమె అడగలేదు. "నాకాడేమ దుంప ?" అని అన్నది.

"అదేందె బుగ్గిలో పోస్తనని బయమా? నిజం. నీ తోడు. . .నాను పావలా అర్దా సొప్పున రిచ్చా ఓనరుకు బాకీ ఉండాను. ఆడు మొత్తం అంతా ఇయ్యాలే ఇమ్మంటుండాడు. లేకుంటే రిచ్చా ఇయ్యడంట."

"నాకాడ పైసన్నా లేదు. నిజం సెబుతుండాను రేత్రి ఆ ప్రొబీసను ఎదవొచ్చి అంతా అట్టిగెల్లిండు. నాకాడేం లేదు. ఏం సెయ్యమంటావ్?"

వీరన్న బ్రతిమిలాడటం మొదలుపెట్టాడు. "నువ్వే అట్టాగంటే ఏందే? ఇక ఇయ్యాల్నించీ రిచ్చా లేదు. నాను అబద్దం సెబుతుండాననుకొండావా? నా మాట నమ్మ. పదియ్య. అప్పుకింద సెల్లించకపోతే నన్ను నీ ఇట్టంవొచ్చిన పేరెట్టి పిలు."

అప్పలమ్మ సమాధానం చెప్పలేదు. మౌనంగా వింటూ టేబుల్‌పక్కనే నిల్చున్నది. మొగుడు చెప్పుతున్నది కల్పిత గాథ అని ఆమెకు స్పష్టంగా తెలుసు.

". . . ఈ ఒక్కసారికీ ఇయ్యి. నేకపోతే రిచ్చా పోతది. మళ్ళీ కావాలంటే దొరకదు. ఇయ్యవా మరి. . ."

ఇవ్వకూడదని ఎంత అనుకొన్నా అప్పలమ్మ, మొగుడు అట్టా బ్రతిమాలుతూంటే కఠినంగా ఉండలేక పోయింది. "సరే, ఈడనే ఉండు. ఆ వంటాయనకాడ ఏందన్నా ఉండదేమో తీసుకొస్తా..." అంటూ లోపలికి వెళ్ళింది. వంటగదిలోకి వెళ్ళి డబ్బులసంచీ బయటికి తీసి, నాలుగు రూపాయలనోట్లు చేతపట్టుకొని, సంచీని మళ్ళీ బొడ్లో దోపుకొని హాలులోకి వచ్చింది.

బొక్కిందే దక్కుడనుకొంటూ పెళ్ళాం ఇచ్చిన నాలుగు రూపాయలు తీసుకుని వీరన్న సంతోషంగా వెళ్ళాడు.

కాలచక్రం బద్ధకంగా తిరుగుతూంది. అక్కడికి మసకగా కనిపిస్తున్న మ్యునిసిపల్ క్లాక్ టవర్‌లోని పెద్ద ముల్లు ఆరుమీదికీ, చిన్న ముల్లు పది పదకొండుల మధ్యకీ చేరుకొన్నాయి. పదిన్నర అయినట్టుగా ఏదో ఫాక్టరీ కూతపెట్టింది.

ఎండ మాడ్చేస్తూంది.

హోటలు డ్యూటీ ముగించుకొని అప్పలమ్మ బయటికి వచ్చింది. ముఖానికి పట్టిన చెమట పైట చెంగుతో తుడుచుకొంటూ, ఆమె ఆండాళమ్మపేటకు వెళ్ళే బోసురోడ్డుపై మెల్లిగా నడక సాగించింది.

ఆండాళమ్మపేటలో నెహ్రూ, గాంధీ విగ్రహాలు ఉన్న చౌకుపేరు స్వతంత్ర్యం చౌకు. ఆ చౌకులో ఎడమపక్కగా, చుట్టూఉన్న పెంకుటిళ్లను శాసిస్తున్నట్టుగా కనబడుతున్న పచ్చరంగుమేడ సోమసుందరం గారిది. అప్పలమ్మ సరాసరి ఆ మేడదగ్గిరికి వచ్చి, ప్రహరీ గేటు తోసుకుని లోపలికి అడుగు పెట్టింది.

సోమసుందరంగారు ముప్ఫయి సంవత్సరాలు న్యాయవాదవృత్తిచేసి ప్రస్తుతం విశ్రాంతి తీసుకొంటున్నారు. రెండు చేతులా గడించాడాయన. కొడుకులు అందరూ పెద్ద పదవుల్లో ఉన్నారు. కూతుళ్ళు అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు. ఇక్కడే అసిస్టెంటు ఇంజనీరుగా పని చేస్తున్న మూడో కొడుకుదగ్గిర ముసలి దంపతు లిద్దరూ తమ జీవిత చరమదశ ప్రశాంతంగా, సంతోషంగా గడిపేస్తున్నారు.

వరండాలో పడకకుర్చీలో పడుకొని లా జర్నల్ తిరగేస్తున్న సోమసుందరంగారు అలికిడి విని ఇటు తిరిగారు. అప్పలమ్మను చూడగానే "ఏమిటే?" అంటూ పలకరించారు. ఆమె ఒకప్పుడు వీళ్ళ ఇంట్లో పనిమనిషిగా ఉండేది.

"పోట్టాపీసుకు ఎల్లాల దొరగారూ, తవరికి ఈలయితే. . ." అన్నదామె వినయంగా.

"ఓహో! దానికేం? వెడదాంలే . . . అవునుగాని ఇంకెప్పుడే నువు హోటలు పెట్టేది?"

"అయిపోనాది బాబూ. నెలాఖరుకు సాంబిరెడ్డి హోటలు అమ్మతనన్నడు. కొనేత్తాను బాబూ. హోటేలు ఎవ్వారం అదీ తెలుసుకుందమనే ఇప్పుడు నాయుర్ హోటేలులో పనికి కుదిరినాను దొరా."

"మంచిపని చేశావు. వ్యాపారం గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండటమే అన్నింటికన్నా ముఖ్యం. అయితే ఇప్పుడు పోస్టాఫీసులో నువ్వు దాచుకున్న వెయ్యిన్నర హోటలు వ్యాపారానికి సరిపోదుటే?"

"సాల్దు బాబూ. మరి కొంత గావాలంట. నెలాకరుకు కొంత పోగవుద్ది. వడ్డీలకు కొంత ఇచ్చినాను. ఆయన్నీ వసూలు సేత్తాను. . . అంతా తమ దయ. . ."

"నాదేముందే? నానా-గడ్డి తిని కష్టపడి సంపాయిస్తున్నావు . . . సరేగాని సారావ్యాపారంలో హోటలు కంటే లాభం ఉండదుటే?"

"నాభం దేముంది దొరా, గవరం నేదు. ప్రతోళ్ళకూ లోకువే. సారావోళ్ళంటే సులకనే బాబూ. ప్రొబీసను వోళ్ళకు కోపమొత్తే ఏ చ్చన్నాన్నయినా జైల్లో పెడతారు. గవరవంగా ఏదన్నా యాపారం సేయాలంటే డబ్బులుండాలగందా దొరా. కాబట్టే ఈ సారాయాపారం సేత్తుండాను. హోటేలుపెట్టాక ఎందుకు సేత్తాను బాబూ?"

"నీ పిల్లలు బాగా చదువుతున్నారా?"

"సదువుతుండారు బాబూ. అళ్ళగోసమేగద బాబూ ఈ తిప్పలన్నీ. ఆళ్ళూ మామాదిరి గాకండా బాగా సదుక్కొని పెద్దుద్యోగాలు సెయ్యాలని నాను కోరుతుండాను దొరా, బగమంతుడు ఏం సేస్తాడో. ఆళ్ళు సదువుకోవాలే గాని, కడుపుకు తినకుండాన్నైనా సెప్పిస్తాను దొరా. . ."

"ఉండు. నీ పాస్‌బుక్ తీసుకొస్తాను. పోస్టాఫీసుకు వెడదాం" అంటూ సోమసుందరంగారు కుర్చీలోంచి లేచి లోపలికి వెళ్ళారు.

తాను సంపాదించిన డబ్బు రెండు రోజుల కొకసారి అప్పలమ్మ తెచ్చి సోమసుందరంగారికి ఇస్తుంది. ఆయన ఈమెపేరిట పోస్టాఫీసులో వేస్తూంటారు. అప్పలమ్మ ఇంత డబ్బు దాచిపెట్టిందని సిద్ధక్కకూ తెలీదు, వీరన్నకూ తెలీదు. తన చుట్టుపట్ల ఉన్న వాతావరణాన్ని చూసి భయపడి అప్పలమ్మ పాస్‌బుక్‌ను కూడా సోమసుందరంగారి దగ్గిరే అట్టేపెట్టింది.

సోమసుందరంగారు లాల్చీ వేసుకొని కుడిచేత్తో పోస్టాఫీసు పాస్‌బుక్‌ను, ఎడంచేత్తో చేతికర్రను పట్టుకొని బయటికి వచ్చారు.

ఆయన రావటం చూసి అప్పలమ్మ అంతకుముందే సంచీలోంచి తీసి చేతులో పెట్టుకొన్న రూపాయల నోట్లు పడకకుర్చీలో పెట్టింది. అవి తీసి ఆయన లెక్కపెట్టి "ముప్ఫయ్యేడు. అవునా?" అన్నారు.

"సిత్తం దొరా."

"సరే పద" అంటూ సోమసుందరంగారు చెప్పులు తొడుక్కుని బయలుదేరారు.

ఆయన వెనకాలే అతి నమ్రతతో అప్పలమ్మ బయలుదేరింది.

ఆమె లక్ష్యసాధనలాగానే అక్కడికి పోస్టాఫీసు కూడా అట్టే దూరం లేదు. ★

## మనిషిలాగ నడువు నీవు!

**జి. వెంకటేశ్వర్లు**

ఇతరుల్ని చూస్తూనే
నిన్ను నీవు చూసుకో.
మందిమాటలు వింటూనే
నీ మనసు మాట నమ్ముకో!
క్లాసు బుక్స్ చదువుతూనే
అసలు విద్యేదో చదువుకో.
కారు ప్రయాణం చేస్తూనే
కాలి నడక అలవర్చుకో.
హొటల్ కూడు తింటూనే
వంట మాత్రం నేర్చుకో.
ఎలక్ట్రిసిటి ఉన్నా కూడా
ఎక్కా దగ్గిర ఉంచుకో.
చాకలిని నమ్ముకొని, నీ
చాకిరీ మరిచిపోకు సుమా!
మంగలి ఉన్నాడనుకొని, నీ
షేవింగ్ బాక్స్ వదిలిపోకు!
అంతరాత్మ కన్న మిన్న
ఆత్మీయులు వేరెవరన్నా?
మందబలము చూచి మొరుగు
కుక్కలాగ మసల కన్న!
దీపం ఉన్నప్పుడే నీ
ఇల్లు చక్కబెట్టుకో.
అద్దె కొంపలో ఉంటూనే
నీ వొక ఇల్లు కట్టుకో.
మనసున్న మనిషిలాగ
మనుగడ సాగించుకో.
మల్లెలాగ పరిమళాల
ఎల్లెడలా గుబాళించు!
పెద్దల చెప్పు చేతలలో
ఎద్దులాగ నడవకుమీ!
బుద్ధి ఉన్న మనిషిలాగ
కొద్దిగనయినా నడుచుకో! *